క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నక్కల గుట్ట కాలనీ, బాలాజీనగర్‌లో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

యువకుడికి గాయాలు

గోరంట్ల: మండల పరిధిలోని వానవోలు తండా సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో వానవోలు తండాకు చెందిన వెంకటేశునాయక్ అనే యువకుడు తీవ్రంగా గాయపడినట్లు ఎస్‌ఐ బాబు తెలిపారు. గాయపడిన యువకున్ని 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

ఘనంగా సాయి కాళేశ్వర్ జయంతి



నగరేశ్వరాలయం కాంపౌండ్ నిర్మాణానికి భూమి పూజ చేసిన దృశ్యం

పెనుకొండ: సాయి కాళేశ్వర్ సేవలు ఎన్నటికీ మరువలేనివని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్మన్ శిల్పా పేర్కొన్నారు. పట్టణంలోని శివసాయి మందిరంలో ఆదివారం సాయి కాళేశ్వర్ 50వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి కాళేశ్వర్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి కాళేశ్వర్ తల్లిదండ్రులు సుబ్బరాయుడు, సుబ్బమ్మ కూడా పూజల్లో పాలుపంచుకున్నారు. అనంతరం నగరేశ్వరాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. అనంతరం నగరేశ్వరాలయం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శిల్పా భూమి పూజ చేశారు.

వాలీబాల్ టోర్నీ విజేత 'శ్రీరంగరాజుపల్లి'



విజేత జట్టుకు నగదు బహుమతిని అందజేస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో శ్రీరంగరాజుపల్లి జట్టు విజయం సాధించింది. మొత్తం పదహారు జట్లు పాల్గొనగా ఫైనల్‌లో శ్రీరంగరాజుపల్లి జట్టు విజయకేతనం ఎగురవేసినట్లు మండల వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కార్తీక్ తెలిపారు. గెలుపొందిన విజేత జట్టుకు ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రిన్సిపల్ ఎన్వీ మురళీధర్‌బాబు తదితరులు జ్ఞాపికతో పాటు నగదు బహుమతిని అందజేశారు.

నేడు చేపల చెరువు వేలం

లేపాక్షి: మండలంలోని పులమతి పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు చేపల చెరువు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్ అశ్వత్థనారాయణ అధ్యక్షతన వేలం పాట జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ నుంచి జేడీఎస్‌లో చేరిక

పావగడ: మాజీ ఎమ్మెల్యే, జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప సమక్షంలో పలువురు కాంగ్రెస్ నాయకులు జేడీఎస్ తీర్థం పుచ్చుకున్నారు. బోదుల మారెమ్మ ఆలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రామప్ప, సొసలకుంటి తిప్పేస్వామి, గంగసాగర నాగరాజు, మోహన్, నరసింహ, గోపాల్, నాగప్ప, జేడీఎస్‌లోకి చేరారు.

పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ

- పప్పుశనగ సాగుపై రైతుల ఆసక్తి
- గతంలో కంటే అధికంగా సాగులోకి..
- వేరుశనగ కంటే లాభాలు ఎక్కువేనంటున్న రైతులు



పెనుకొండలో కళకళలాడుతున్న పప్పుశనగ పంట

పెనుకొండ రూరల్: పప్పుశనగ సాగు రైతులకు లాభాలను ఆర్జించిపెడుతోంది. తక్కువ పెట్టుబడితోనే అధిక దిగుబడి, లాభాలు వస్తుండటంతో ఎక్కువ మంది పప్పుశనగ సాగుకు మొగ్గు చూపుతున్నారు. రాయలసీమ జిల్లాల్లో రబీ సీజన్‌లో ఎక్కువ మంది వేరుశనగ పంటనే వేస్తుంటారు. అయితే నల్లరేగడి భూములున్న రైతులు అధిక సంఖ్యలో పప్పుశనగ సాగు చేస్తున్నారు.

పెరిగిన పంట విస్తీర్ణం

పెనుకొండ మండల వ్యాప్తంగా గత యేడు 785 ఎకరాల్లో పప్పుశనగ పంటను సాగు చేశారు. ఈ యేడు 900 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పప్పుశనగ పంట 90 రోజుల నుంచి 105 రోజుల్లో కోత దశకు వస్తుంది. పంట వేసేందుకు అక్టోబర్ నుంచి నవంబర్ 15 లోగా అనువైన సమయం. పంటకు సాధారణంగా పచ్చపురుగు, కాయతొలిచే పురుగు ఆశిస్తాయి. అయితే వాటి నివారణకు క్రిమిసంహారక రసాయనాలైన స్పైనోశాడ్ రసాయనాన్ని ఒక ఎకరాకు 60 ఎంఎల్ మిశ్రమాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా నియంత్రించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రోగ, చీడ నియంత్రణకు కూడా పప్పుశనగ అనువైన పంట అని అంటున్నారు.

క్వింటాల్ రూ.5 వేల నుంచి రూ.6 వేలు

డిసెంబర్, జనవరి ఉండే వాతావరణ పరిస్థితులకు పంట సులువుగా కోత దశకు చేరుతుంది. పప్పుశనగకు మార్కెట్లోనూ మంచి ధర ఉంది. ఒక క్వింటాల్ రూ.5 వేల నుంచి రూ. 6 వేల వరకు ధర పలుకుతోందని రైతులు చెబుతున్నారు. వేరుశనగ కంటే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించవచ్చని పేర్కొన్నారు.

వేరుశనగ కంటే పప్పుశనగే మేలు



పప్పుశనగకు చీడ తక్కువ శాతం వస్తుంది. పచ్చ పురుగు, కాయ తొలిచే పురుగు మాత్రమే ఈ పంటకు ప్రధానంగా చీడ పడుతుంది. మందులు పిచికారీ చేయడం ద్వారా సులువుగానే చీడలను అరికట్టవచ్చు. రైతులకు నిత్యం అందుబాటులో ఉండి సలహాలు, సూచనలిచ్చేందుకు రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది ఎప్పుడూ అందుబాటులోనే ఉంటారు. వేరుశనగతో పోలిస్తే పప్పుశనగ అధిక లాభాలను అందిస్తుంది.

– సురేంద్రనాయక్, వ్యవసాయ అధికారి, పెనుకొండ

పప్పుశనగే ప్రధాన పంట



పెనుకొండ మండలంలోని అడదాకులపల్లి సమీప గ్రామాల్లో నల్లరేగడి నేలలు అధికంగా ఉన్నాయి. దీంతో ఇక్కడున్న రైతులంతా ప్రధాన పంటగా పప్పుశనగనే సాగు చేస్తున్నాము. నేను 16 ఎకరాల్లో పంట సాగు చేశాను. ఎకరాకు రూ.12 వేలు పెట్టుబడి పెట్టారు. పంట దిగుబడి బాగా వస్తే ఎకరాకు రూ. 30 నుంచి రూ. 35 వేలు ఆదాయం వస్తుంది.

– వెంకటరెడ్డి, రైతు, అడదాకులపల్లి

గ్రామ స్వరాజ్యమే జగనన్న ధ్యేయం

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ, చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

గోరంట్ల: అర్హతే ప్రామాణికంగా నిరుపేదలందరికీ కుల, మత, రాజకీయలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. మండలంలోని నార్సింపల్లి పంచాయతీ పరిధిలోని ఎర్రబల్లి, నార్సింపల్లి గ్రామాల్లో ఆదివార సర్పంచ్ లక్ష్మీదేవి నేతృత్వంలో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సంక్షేమ పథకాల వల్ల చేకూరిన లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్ అందజేశారు. అలాగే ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు 2014 ఎన్నికల ముందు రాజకీయ లబ్ధి కోసం ఆరు వందలకు పైగా ఆచారణ సాధ్యం కాని హామీలు ఇచ్చి... అధికారం చేపట్టిన తరువాత హామీలను తుంగలో తొక్కి అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహించిన పాదయాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకొని నవరత్న పథకాలను ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినట్లు చెప్పారు. జాతిపిత మహాత్మగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యామే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. కుల,మత, రాజకీయలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా వలంటీర్ వ్యవస్థ ద్వారా నిరుపేదలందరికీ ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని చెప్పారు. పేదల సంక్షేమం కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ని వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నియోజకవర్గ పరిశీలకుడు బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పాలేజ యరాంనాయక్, గోరంట్ల మార్కెట్ యార్డు అధ్యక్షుడు బూదిలి వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నూర్‌మహమ్మద్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు బాషా, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, బూదిలి సహకార సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు తిప్పమ్మ, నార్సింపల్లి మాజీ సర్పంచ్ వెంకటశివారెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలన్నగారిపల్లి శివారెడ్డి, నాయకులు పద్మనాభరెడ్డి, ఆర్.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకే మద్దతు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వివిధ సంక్షేమ పథకాల ద్వారా మా కుటుంబానికి రూ.1,10,596 లబ్ధి చేకూరింది. పేదలకు అండగా నిలబడటంతో మా కుటుంబ పోషణక ఎలాంటి ఇబ్బంది లేదు. ఏ ఇబ్బంది వచ్చినా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు స్పందిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలుస్తాం.

– మారేప్ప, యర్రబల్లి

వసూలుదారులపై చర్యలు తీసుకోండి

పెనుకొండ: పట్టణంలోని బాబయ్య స్వామి ఉరుసులో దుకాణాలు ఏర్పాటు చేసిన వారి నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకుడు రమేష్ డిమాండ్ చేశారు. అధికారులు, పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

శిథిలావస్థలో పోలీసుస్టేషన్



పెచ్చులూడిన పోలీస్‌స్టేషన్ పైకప్పు

పావగడ: పట్టణంలోని తాలూకా కార్యాలయం పరిధిలో ఉన్న పోలీసుస్టేషన్ భవనం పైకప్పు దెబ్బతింది. పై పెచ్చులు ఉండి పడుతుండటంపై పోలీసు సిబ్బందితో పాటు స్థానికులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే ఓ ఖైదీ తలపై పెచ్చులు పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. శిథిలావస్థకు చేరిన పోలీసుస్టేషన్‌కు నూతన భవనాన్ని నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రశాంతంగా ఎంపిక పరీక్ష

హిందూపురం: అభయ నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంజీఎం ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక పరీక్ష నిర్వహించారు. 423 మందికి గాను 247 మంది హాజరైనట్లు ఆ సంస్థ ప్రతినిధి రాజశేఖర్ తెలిపారు.

వేటగాళ్లకు పండగ



రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానదిలో నీటి ప్రవాహం ఉధృతి కొనసాగుతోంది. ఇందులో భాగంగానే పలువురు చేపల వేట సాగిస్తున్నారు. పది కేజీలకు పైన ఉన్న చేపలు దొరుకుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నాయకుడు మోహన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే తనయుడు దినేష్

రొళ్ల: మండల పరిధిలోని గుడ్డగుర్కి పంచాయతీ పరిధిలోని జీఎన్‌పాళ్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మోహన్ ఆదివారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మడకశిర పట్టంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి తనయుడు, తాలూకా బూత్ మేనేజర్ దినేష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మోహన్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. గుడ్డగుర్కి సర్పంచ్ హరిక్రిష్ణ, వైస్ సర్పంచ్ గౌడయ్య, నాయకులు శ్రీరాములు, పంచాయతీ కన్వీనర్ బండెప్ప, మెంబర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై కారు బోల్తా



దెబ్బతిన్న కారు

పెనుకొండ రూరల్: పెనుకొండ పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం టైర్ పంక్చర్ కావడంతో ఓ కారు బోల్తా పడింది. బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్తుండగా గుట్టూరు సమీపంలోకి రాగానే కారు (టీఎస్12 ఈఎల్2396) ముందు టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు స్వల్పంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు.

ఉపాధి కూలీలతో సమావేశం

లేపాక్షి: మండలంలోని కొండూరు పంచాయతీ పరిధిలోని వడ్డిపల్లిలో ఆదివారం ఉదయం ఉపాధి ఇంజినీర్ మధుసుధన్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ అయూబ్ కూలీలతో సమావేశం నిర్వహించారు. వంద రోజుల పనులు పూర్తి చేయని వారు పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రొద్దం: ప్రతి గ్రామం నుంచి ఉపాధి పనులకు కూలీలు ఎంత మంది వచ్చినా పనులు కల్పిస్తామని ఏపీఓ జగదీశ్ అన్నారు. ఆదివారం మండలంలోని పాతర్లపల్లి, నారనాగేపల్లి గ్రామాల్లో ఉపాధి సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా కూలీలకు పనులపై అవగాహన కల్పించారు.

గుడ్డంపల్లిలో ఎలుగు సంచారం

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుడ్డంపల్లి, నీలకంఠాపురం గ్రామాల్లో రాత్రి సమయంలో ఎలుగు బంటి సంచరిస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి నీలకంఠాపురం గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయ ఆవరణం వద్దకు ఎలుగు బంటి రావడంతో ప్రజలు కేకలు వేయడంతో చెట్లలోకి పరుగులు తీసిందన్నారు. రాత్రి పూట గుడ్డంపల్లిలోని ఇళ్ల వద్దకు ఎలుగు వస్తోందని స్థానికులు తెలిపారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకొని ఎలుగు గ్రామాల్లోకి రాకుండా చూడాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనుకొండ రూరల్ : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడిన సంఘటన ఆదివారం సాయంత్ర పెద్దచెరువుకట్ట ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో చోటు చేసుకుంది. ధర్మవరంలోని తారకరామాపురానికి చెందిన చేనేత కార్మికులు గౌస్, మధు హిందూపురంలో శుభకార్యానికి వెళ్లి తిరిగి వెళ్తున్నారు. అయితే ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

రొద్దం: భారీ వాహన డ్రైవర్లు, క్లీనర్ల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డ్రైవర్ల యూనియన్ సాధన సమితి నాయకులు ఎమ్మెల్యే శంకరనారాయణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు వెంకటశివ, సెక్రటరీ మసూదలి, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

డాక్టర్ శివన్నకు కవితా పురస్కారం



శివన్నను ఉత్తమ పురస్కారంతో సన్మానిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: కర్ణాటక రాష్ట్రంలోని హావేరిలో జరుగుతున్న 86 అఖిల భారత కన్నడ సాహిత్య పరిషత్ సమ్మేళనంలో డాక్టర్ శివన్న గడినాడు కవిగా వలస పక్షి అనే కన్నడ కవితను చదివి వినిపించారు. ఆయన సేవలను గుర్తించి కన్నడ సాహిత్య, సాహిత్య పరిషత్ సమ్మేళన అధ్యక్షుడు రంగేగౌడు, డాక్టర్ మనోహర్ జోషి, సభ్యులు ఉత్తమ కవితా పురస్కారం అందజేసి సన్మానించారు. ఈ విషయాన్ని డాక్టర్ శివన్న ఓ ప్రకటన ద్వారా తెలిపారు. మడకశిర మండలం గౌడనహళ్లి ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడిగా శివన్న పని చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదర్శన



అలంకరణలో గుడ్డం రంగనాథస్వామి

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గిరి ప్రదర్శన కార్యక్రమం ఘనంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి మేళాతాళాలతో గిరి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగేంద్రుడు, అర్చకులు గోవిందశర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అద్భుతం.. రాతి శివాలయం



ప్రారంభానికి సిద్ధమైన రాతి శివాలయం



అర్ధనారీశ్వర లింగం, ద్వాదశ లింగాలు

- జిల్లాలో ఎక్కడాలేని విధంగా 'పురం'లో నిర్మాణం
- ఒకేచోట ద్వాదశ జ్యోతిర్లింగాలు, బాణాలింగాలు
- 24న విగ్రహ ప్రతిష్ట

హిందూపురం: జిల్లాలో ఎక్కడాలేని విధంగా హిందూపురం పట్టణంలోని త్యాగరాజనగర్‌లో రాతి శివాలయం అద్భుతంగా రూపుదిద్దుకుంది. దాతల సహకారంతో దాదాపు రూ.కోటిన్నరకుపైగా వ్యయం చేసి ఎన్నో ప్రత్యేకతలతో ఆలయాన్ని నిర్మించారు.

ఆలయంలో అన్నీ ప్రత్యేకతలే...

రాతి కట్టడంతోనే నిర్మించాలన్న ఉద్దేశంతో నిర్వాకులు తెలంగాణలోని యాదగిరిగుట్ట ఆలయ నిర్మాణ శిల్పులతో ఆలయ నిర్మాణ పనులు చేయించారు. శిల్పి జ్ఞానేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో శివాలయం రూపుదిద్దుకుంది. గర్భాలయంలో ప్రతిష్ఠించనున్న శివలింగం ఎంతో ప్రత్యేకత కల్గింది. గోకర్ణం వద్ద నర్మాదానదిలో సహజ సిద్ధంగా ఏర్పడిన రాయితో మూడు అడుగుల ఎత్తున్న అర్ధనారీశ్వరుడిని లింగ రూపంలో ప్రతిష్టిస్తున్నారు. అలాగే 12 ద్వాదశ అర్ధనారీశ్వర లింగాలు, 108 బాణాలింగాలను ఏర్పాటు చేస్తున్నారు. కర్ణాటక హంపి కృష్ణశిలతో పాణవట్టం, పార్వతీదేవి, సిద్దిబుద్ధి సమేత వినాయక విగ్రహాలు తయారు చేశారు. అలాగే నంది విగ్రహం, 33 అడుగుల ధ్వజస్తంభాన్ని బెంగళూరులో సిద్ధం చేయించారు. అలాగే నవగ్రహ విగ్రహాలు కూడా తయారు చేయించారు.

24న విగ్రహ ప్రతిష్ఠ

ఈనెల 24 నుంచి 26 వరకు ఆలయంలో స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా ఒకే చోట ద్వాదశ జ్యోతిర్లింగాలు, బాణాలింగాలు, ఇతర దేవతా మూర్తులు ఉండేలా చర్యలు తీసుకున్నారు.

పట్టణానికే తలమానికం



భక్తులందరి సహకారంతో శివాలయం అద్భుతంగా రూపుదిద్దుకుంది. ఇంకా మరిన్ని పనులు చేయాల్సి ఉంది. అంతా సిద్ధమైతే ఈ ఆలయం పట్టణానికే తలమానికంగా నిలుస్తుంది.

– అశ్వర్థనారాయణ మూర్తి, అర్చకులు